

జిల్లా స్థాయి స్కేటింగ్ ఎంపిక పోటీలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లా యువసేవలు, క్రీడా శాఖ వారి ఆధ్వర్యంలో ఏలూరులోని ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి స్కేటింగ్ ఎంపిక పోటీలు మొదటి రోజు శనివారం నిర్వహించారు. జిల్లాలోని వివిధ పాఠశాలలు, అకాడమీలకు చెందిన యువ స్కేటర్లు ఈ పోటీల్లో తమ ప్రదర్శన కనబరిచారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డిఎస్‌డిఒ బి.శ్రీనివాసరావు, ఒలంపిక్ సెక్రటరీ బడేటి వెంకట్రామయ్య, వెయిట్ లిఫ్టింగ్ కోచ్ రమేష్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ స్కేటింగ్ పోటీల్లో మంచి ప్రతిభను కనబరిచిన క్రీడాకారులను ప్రశంసించారు. యువత క్రీడల్లో చురుకుగా పాల్గొని శారీరక దృఢత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ స్కేటింగ్ పోటీల్లో నాలుగు నుంచి 15 సంవత్సరాల లోపు క్రీడాకారులు పాల్గొన్నారు. ఇందులో విజయం సాధించిన తీరజ్, శ్రీయ, దేవాన్ష్, శరణ్ శ్రీ వాత్సవ్, లక్ష్మి, భావన, రత్న శ్లోకాలను అభినందించారు.

ఆశాల భర్తీలో పొలి'ట్రిక్స్'..!

ఏప్రిల్ మొదటి వారంలో నోటిఫికేషన్ విడుదల

ఏలూరు జిల్లాలో 55, పశ్చిమలో 65 పోస్టుల భర్తీకి గ్రీన్ సిగ్నల్

విహెచ్ఎస్ఎన్‌సి కమిటీ ముగ్గురిని ఎంపికచేసే ప్రక్రియ ఎప్పుడో పూర్తి

డిఎంహెచ్ఒ కార్యాలయంలో ముందుకు సాగని ప్రక్రియ

రాజకీయ జోక్యంతోనే ఆశాల పోస్టుల భర్తీ నిలిచిపోయినట్లు ప్రచారం

జిల్లా కలెక్టర్లు ఎందుకు పట్టించుకోవడంలేదని చర్చ



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

'ఆశా వర్కర్ల ఖాళీల భర్తీకి సంబంధించి జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు ఎందుకు తాత్సారం చేస్తున్నారు. జూన్ నెలాఖరుకు ప్రక్రియ పూర్తి కావాలని నోటిఫికేషన్‌లో పేర్కొన్నప్పటికీ ఇప్పటివరకూ ఎందుకు పూర్తి చేయలేదు. విహెచ్ఎస్ఎన్‌సి కమిటీ ముగ్గురిని ఎంపిక చేసే ప్రక్రియ పూర్తి చేసి జాబితా పంపించినా డిఎంహెచ్ఒ కార్యాలయంలో ఫైల్ ఎందుకు కదలడం లేదు. ఆశా వర్కర్ల భర్తీకి సంబంధించి జిల్లా కలెక్టర్లు పట్టించుకోకపోవడానికి రాజకీయ జోక్యమే ప్రధాన కారణమా' అన్న ప్రశ్నలు అందరినీ వేధిస్తున్న పరిస్థితి నెలకొంది. ఆశా వర్కర్ల ఖాళీ పోస్టుల భర్తీకి సంబంధించి 2025 ఏప్రిల్ ఏడో తేదీన ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రూరల్, అర్బన్, ట్రైబల్ ఏరియాలో ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఏలూరు జిల్లాలో ఖాళీ పోస్టులు 55 ఉండగా ఇందులో రూరల్‌లో 50, ట్రైబల్ ఏరియాలో నాలుగు, అర్బన్‌లో ఒక పోస్టు ఉంది. పశ్చిమగోదావరి జిల్లాలో మొత్తం 65 పోస్టులు ఖాళీలు ఉన్నట్లు పేర్కొనగా ఇందులో రూరల్ ప్రాంతంలో 28 పోస్టులు, అర్బన్‌లో 37 పోస్టుల భర్తీకి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. జూన్ 15వ తేదీ నాటికి ఎంపిక ప్రక్రియ మొత్తం పూర్తి చేయాలని, ఎంపికైన అభ్యర్థులకు సంబంధించిన జాబితాను జూన్ 30వ తేదీకి రాష్ట్ర కార్యాలయానికి పంపించాలని ఆరోగ్య శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. దీనికి అనుగుణంగా ఆశా వర్కర్ల భర్తీకి అధికారులు చర్యలు చేపట్టారు. నిబంధనల ప్రకారం ప్రతి ఆశా పోస్టుకు సంబంధించి వచ్చిన దరఖాస్తులన్నీ రూరల్ ప్రాంతంలో అయితే గ్రామ పరిధిలోని విహెచ్ఎస్ఎన్‌సి (విలేజ్ హెల్త్ అండ్ శానిటేషన్ కమిటీ)కి, అర్బన్‌లో అయితే యుహెచ్ఎస్ఎన్‌సి (అర్బన్‌హెల్త్ అండ్ శానిటేషన్ కమిటీకి)కి చేరతాయి. ఈ కమిటీలో గ్రామ సర్పంచితోపాటు, కార్యదర్శి, వార్డు మెంబర్లు, ఎఎన్ఎం అంగన్‌వాడీ టీచర్ ఇలా మొత్తం పది మంది వరకూ మెంబర్లు ఉంటారు. వచ్చిన దరఖాస్తుల్లోంచి ముగ్గురిని ఎంపిక చేసి ఈ కమిటీ డిఎంహెచ్ఒ (జిల్లా ఆరోగ్యశాఖ అధికారి) కార్యాలయానికి పంపించడం జరుగుతోంది. ముగ్గురిలో మెరిట్ ఉన్న ఒక అభ్యర్థిని డిఎంహెచ్ఒ కార్యాలయ అధికారులు ఎంపిక చేసి జిల్లా కలెక్టర్‌కు ఫైల్ పంపించి ఎంపిక ప్రక్రియ పూర్తిచేయాల్సి ఉంటుంది. గ్రామ, అర్బన్‌స్థాయిలోని కమిటీలు ముగ్గురు అభ్యర్థులను ఎంపిక చేసి జాబితాను జిలా ఆరోగ్యశాఖ కార్యాలయానికి ఎప్పుడో పంపడం జరిగింది. ఇప్పటి వరకూ ఎంపికైన అభ్యర్థుల ఫైనల్ జాబితా మాత్రం ప్రకటించలేదు. దీంతో అధికారుల తీరుపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

రాజకీయ జోక్యంతోనే కలెక్టర్లు మౌనం వహిస్తున్నారా?

ఆశా వర్కర్ల ఎంపికలో రాజకీయ నాయకుల జోక్యం కారణంగా తుది జాబితా విడుదల కాలేదన్న చర్చ నడుస్తోంది. ఎంపిక కమిటీలు పంపించిన ముగ్గురి జాబితాలో తమకు నచ్చిన వారిని ఎంపిక చేయాలని ఎంఎల్ఎలు, స్థానిక ప్రజాప్రతినిధులు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. మెరిట్ ఆధారంగా కాకుండా రాజకీయ నాయకులు చెప్పినట్లు ఎంపిక ప్రక్రియ పూర్తిచేస్తే తీవ్ర విమర్శలు వచ్చే అవకాశం ఉండటంతో జిల్లా ఆరోగ్యశాఖ అధికారులు ఫైల్‌ను ముందుకు కదపడం లేదని సమాచారం. ఆశావర్కర్ల పోస్టుల భర్తీకి సంబంధించిన అంశంలో జిల్లా కలెక్టర్లే తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. దీనిపై జిల్లా కలెక్టర్లు ఎందుకు చొరవ చూపడం లేదన్న చర్చ సర్వత్రా నెలకొంది. నిబంధనల ప్రకారం ఆశా వర్కర్ల భర్తీని పూర్తి చేయాల్సి ఉన్నప్పటికీ ఎందుకు పూర్తి చేయడంలో అర్థంకావడం లేదు. జిల్లా కలెక్టర్లు సైతం రాజకీయ నాయకులు ఒత్తిడికి తలొగ్గరా అన్న అనుమానాలు నెలకొన్నాయి. ఆశా వర్కర్లు పోస్టులు భర్తీ చేయకపోవడంతో ఆ పనిని పక్కన ఉన్న ఆశా వర్కర్లకు అప్పగిస్తున్నారు. దీంతో వారంతా పనిభారంతో నలిగిపోతున్నారు. పని సకాలంలో పూర్తిచేయడానికి నానా ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు మాత్రం ఇవేమీ పట్టించుకోకుండా ఆశా వర్కర్ల పోస్టుల భర్తీపై తీవ్ర తాత్సారం కొనసాగిస్తున్నారు. దరఖాస్తు దారులు సైతం ఉద్యోగం కోసం ఎన్నో ఆశలతో ఎదురుచూస్తున్నారు. ఆశా వర్కర్ల తుదిజాబితాను వెంటనే విడుదల చేయాలని వారంతా కోరుతున్నారు.

ఫైనల్ జాబితా తయారైంది.. కలెక్టర్ వద్ద పెట్టాల్సి ఉంది

వెంకట్, డిస్ట్రిక్ కమ్యూనిటీ మొబలైజర్ అధికారి

ఆశావర్కర్ల పోస్టుల భర్తీకి సంబంధించి ముగ్గురు ఎంపికతో కూడిన జాబితా జిల్లా కార్యాలయానికి వచ్చింది. ఎంపికైన అభ్యర్థుల ఫైనల్ జాబితా తయారు చేయడం పూర్తయ్యింది. జిల్లా కలెక్టర్ వారికి జాబితా పెట్టాల్సి ఉంది. అది పూర్తయిన తర్వాత ఎంపిక జాబితా విడుదల చేయడం జరుగుతోంది.

జిఎస్‌టి ప్రయోజనాలు ప్రజలకు అందాలి

జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

జిఎస్‌టి 2.0 ప్రయోజనాలు ప్రజలందరికీ అందాల్సిందేనని, ఈ విషయంలో సహకరించని వర్తకులపై ప్రజలు చేసే ఫిర్యాదులను పరిగణనలోకి తీసుకుని తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కె.వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు పెద్దఎత్తున ప్రయోజనాలు కల్పించే ఉద్దేశంతో జిఎస్‌టిలో విప్లవాత్మకమైన సంస్కరణలు తీసుకొచ్చాయని, జిఎస్‌టి ఫలాలు ప్రజలందరికీ అందేలా వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. అయితే కొంతమంది వర్తకులు కొత్త జిఎస్‌టి విధానాన్ని అమలు చేయకుండా పాత జిఎస్‌టిల స్లాబ్‌ల ప్రకారమే వసూలు చేస్తున్నారన్న ప్రజల అభిప్రాయాలపై కలెక్టర్ స్పందించి తక్షణం చర్యలు తీసుకోవాలని జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. జిఎస్‌టి ప్రయోజనాలకు సంబంధించి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించడానికి, సందేహాలను నివృత్తి చేసేందుకు ఏలూరు జిల్లాలో 8712631283 నెంబర్‌తో ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్, హెల్ప్ డెస్క్‌లను అధికారులు ఏర్పాటు చేశారు. అంతేగాక రాష్ట్ర స్థాయిలో కూడా జిఎస్‌టి ఫిర్యాదుల నమోదుపై



మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి

8712631279 నెంబర్ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ప్రత్యేక కమాండ్ కంట్రోల్ రూమ్‌లకు వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించి, ఫిర్యాదులో అంశాలపై విచారణ చేసి సంబంధిత వర్తకులపై నిబంధలనను అనుసరించి చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ప్రజలు తెలియజేసే సందేహాలను నివృత్తి చేయాలని వాణిజ్య శాఖ అధికారులను కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు.

ఎఎస్ఆర్.నగర్‌కు కరెంటు, నీటి సౌకర్యం కల్పించాలి

వ్యకాస ఆధ్వర్యాన ధర్నా

ప్రజాశక్తి - టి.నరసాపురం

మండలంలోని అల్లూరి సీతారామరాజు నగర్ వాసులకు కరెంటు, నీటి సౌకర్యం కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గుడెల్లి వెంకట్రావు డిమాండ్ చేశారు. ఎఎస్ఆర్ నగర్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ శనివారం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో స్థానిక అంబేద్కర్ సెంటర్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గుడెల్లి వెంకట్రావు మాట్లాడుతూ ఎఎస్ఆర్ నగర్‌కు నీళ్లు ఇవ్వాలని హైకోర్టు ఆర్డరు ఇచ్చినా స్థానిక అధికారులు నీరు, కరెంటు సౌకర్యం కల్పించడానికి మోకాలడ్డుతున్నారని విమర్శించారు. ఇటీవల మండలంలో పర్యటించిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌ను గ్రామస్తులు కలిసి విన్నవించడంతో పేదలకు కరెంటు, నీరు ఇవ్వాలని చెప్పినా స్థానిక పంచాయతీ అధికారులు దేవుడు వరమిచ్చినా పూజారి వరమివ్వని చందంగా వ్యవహరిస్తున్నారని విమర్శించారు. పంచాయతీ అధికారులు తక్షణం ఎస్ఆర్.నగర్ కాలనీ వాసులకు అన్నిరకాల సౌకర్యాలు కల్పించాలని, టి.నర్సాపురం పంచాయతీలో గుర్తించి గిరిజన వాసులకు ఇంటి పన్నులు కట్టించుకుని గ్రామంలో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఏలూరు ఎంపీ గ్రామస్తులకు ఇచ్చిన మాట నిలబెట్టు కోవాలని కోరారు. గత 17 సంవత్సరాలుగా నిర్లక్ష్యానికి గురైన ఎస్ఆర్ నగర్ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మడకం కుమారి, బరగడ కుమారి, మంగ, ముత్తమ్మ, మడకం సుధారాణి తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేస్తున్న ఎస్ఆర్.నగర్ వాసులు

వర్క్ ఔట్‌సోర్సింగ్ విధానం రద్దు చేయాలి

మస్తర్ పాయింట్ వద్ద కార్మికుల నిరసన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో వర్క్ ఔట్ సోర్సింగ్ పేరిట ప్రయివేటీకరణ విధానాన్ని అమలు చేయడానికి 11, 30వ డివిజన్‌లలో ప్రయత్నించడాన్ని సిఐటియు తీవ్రంగా వ్యతిరేకిస్తోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ అన్నారు. కార్మికులను బానిసలుగా మార్చే వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని రద్దుచేసి, ఆప్కాస్ ద్వారా మున్సిపల్ కార్మికుల నియామకాలు జరపాలని ప్రసాద్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.జానుబాబు డిమాండ్ చేశారు. వర్క్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ శనివారం ఏలూరు ఆర్ఆర్ పేట మస్తర్ పాయింట్ వద్ద కార్మికులు నిరసన తెలిపారు. ఈ నిరసన



కార్యక్రమాన్ని ఉద్దేశించి డిఎన్‌విడి ప్రసాద్ మాట్లాడుతూ మున్సిపల్ శాఖా మంత్రి సొంత నియోజకవర్గంలో నెల్లూరు మున్సిపాల్టీ వద్ద వర్క్ ఔట్ సోర్సింగ్ విధానాన్ని సిఐటియు తిప్పి కొట్టిందని, రాష్ట్రంలో మరెక్కడా వర్క్ అవుట్ సోర్సింగ్ విధానాన్ని అమలు చేయబోమని మున్సిపల్ శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారని అన్నారు. ఏలూరు నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మున్సిపల్ కార్మికుల నియామకాలను ఆప్కాస్ ద్వారా చేపట్టాలని, నగర ప్రజలకు మెరుగైన పారిశుధ్య సేవలందించేందుకు కృషి చేయాలని కోరారు. పారిశుధ్య పనులను ప్రయివేటుకరించడం అంటే ప్రజల ప్రాణాలను బలిపెట్టడమేనని తెలిపారు. వర్కు ఔట్‌సోర్సింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని, లేని పక్షంలో మున్సిపల్ కార్మికులను సమీకరించి నెల్లూరు తరహాలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి సిఐటియు ఏలూరు నగర కార్యదర్శి ఎం.ఇస్సాకు, జిల్లా కార్యదర్శి జె.గోపి నాయకత్వం వహించారు.

మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరించొద్దు

జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యాన రౌండ్ టేబుల్ సమావేశం డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు

మెడికల్ కాలేజీలు ప్రయివేటీకరణ వద్దని, ప్రభుత్వ రంగంలోనే నిర్వహించాలనే అంశంపై జిల్లా జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏలూరులోని ఎన్ఆర్.పేటలోని కార్యాలయంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశానికి అధ్యక్షత వహించిన జన విజ్ఞాన వేదిక పూర్వపు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎన్.రమేష్ మాట్లాడుతూ మెడికల్ కళాశాలలు ప్రభుత్వ రంగంలో ఉంటేనే సేవా దృక్పథంతో పనిచేయగలవన్నారు. ప్రయివేట్‌వారికి మెడికల్ కళాశాలలను అప్పగిస్తే వ్యాపార దృక్పథంతోనే పనిచేస్తారే తప్ప సేవా దృక్పథం ఉండదన్నారు. రిటైర్డ్ పశ్చిమగోదావరి జిల్లా సూపరింటెండెంట్ డాక్టర్ రవి గోపాలకృష్ణయ్య మాట్లాడుతూ ప్రభుత్వ రంగానికి ప్రయివేట్ రంగానికి ఉన్న అంతరాన్ని వివరించారు. ప్రజలకు ప్రభుత్వ ఆసుపత్రులు ఇతోటికంగా సేవ చేశాయన్నారు. ప్రభుత్వాలు ప్రజలకు సేవకులుగా ఉండాలే తప్ప కార్పొరేట్లకు సేవలు చేసేవారు లాగా ఉండకూడదన్నారు. ఒకప్పుడు ఎటువంటి వైద్యమైన ప్రభుత్వ రంగంలోనే క్లిష్టమైన సర్జరీలతో సహా జరిగేవని నేడు ప్రతి చిన్నదానికి కార్పొరేట్లపై ఆధార పడాల్సిన దుస్థితి ఏర్పడటానికి కారణం ప్రభుత్వ విధానాలే అన్నారు. రిటైర్డ్ జడ్జి అడబాల లక్ష్మి మాట్లాడుతూ రాజ్యాంగంలోని ఆదేశ సూత్రాల్లో పేర్కొన్న విద్య వైద్యాన్ని ప్రయివేటీజైషన్ చేయటం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ నాయకులు రాజనాల రామ్మోహన్‌రావు మాట్లాడుతూ వైద్యం అనేది సేవారంగంలోనే ఉండాలే తప్ప వ్యాపార దృక్పథంతో కాదన్నారు. సిపిఐ నాయకులు బండి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ప్రభుత్వాలు విధానాలు ప్రజల సంపదను ప్రయివేటువారికి అప్పజెప్పేలా ఉన్నాయన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి.నారాయణరావు, ప్రభుత్వ, ప్రయివేట్ భాగస్వామ్యంతో మెడికల్ కళాశాలల నిర్వహణ కోసం తీసుకొచ్చిన జిఒ 501ను రద్దు చేయాలని తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. సభ తీర్మానాన్ని ఆమోదించింది. ఈ సమావేశానికి ఐవి.సుధాకర్, దేవేంద్ర అప్పారావు అఖిల్, బోడెం శ్రీనివాసరావు, టి.గంగాధరరావు, టి.సత్య, విజిఎంవిఆర్.కృష్ణారావు, స్వరూపరాణి, పిపి శాస్త్రి, నిర్మల, సాయి రమేష్, సిహెచ్.సుందరయ్య, కూనా కృష్ణారావు, రవీంద్రనాథ్, జయపాల్, పెరియార్ తదితరులు పాల్గొన్నారు. లెనిన్ వందన సమర్పణ చేశారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న నేతలు

సుమారు 2.70 లక్షల ఎకరాలకు సాగునీరు

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - ముసునూరు

రైతుల కళ్లల్లో ఆనందం కోసం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడి నాగార్జునసాగర్ ఎడమ కాలువకు నీరందించడం జరుగుతుందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అన్నారు. శనివారం కాట్రేనీపాడు గ్రామంలో డిసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ ఆధ్వర్యంలో ఎన్ఎస్‌పి వాటర్ ద్వారా చెరువులు నిండిన విధానాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నాగార్జున సాగర్ రిజర్వాయర్ ద్వారా 700 క్యూసెక్కుల నీరు విడుదల చేసి, వేంపాడు కాలువలకు సాగు నీరు సరిపోదని నీరు పెంచాలని తెలంగాణ ప్రభుత్వాన్ని కోరానని తెలిపారు. గతంలో పాడేరు దగ్గర గండి పడడం వల్ల గట్టు పూర్తిగా పాడైందని, గట్టు పటిష్టంగా లేని పక్షంలో నీరు అధిక శాతం విడుదల చేయలేమని తెలియజేసిన తెలంగాణ ప్రభుత్వం, నీరు పెంచితే ఈ కట్ట తెగిపోయే ప్రమాదం ఉందని తెలంగాణ అధికారులు చెప్పగా, వెంటనే తన సొంత నిధులు సుమారు రూ.1.30 లక్షలతో యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి పూర్తి చేసినట్లు తెలిపారు. డిసి ఛైర్మన్ రాపర్ల బాలకృష్ణ ఎన్ఎస్‌పి అధికారులతో మాట్లాడి వెంటనే ఆ గండి పటిష్ట పనులు పూర్తికావడంతో సుమారు 800 క్యూసెక్కుల సాగునీరు మొత్తం కలిసి సుమారు 1500 క్యూసెక్కుల సాగునీరు అందించారన్నారు. తద్వారా సుమారు రెండు లక్షల డబ్బై ఎకరాలకు సాగునీరు అందుతోందని తెలిపారు. అలాగే ఈ ఖరీఫ్ సీజన్లో చాట్రాయి, ముసునూరు, నూజివీడు, ఆగిరిపల్లి మండలాల రైతులకు సాగునీరు పుష్కలంగా అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు గద్దె రఘుబాబు, రాపర్ల ప్రతాప్, రాపర్ల బాలకృష్ణ, బొమ్మకంటి శ్యామలరావు, సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, గద్దల సుహాసిని మోహనరావు, గరిక ముక్కు నాని, కండేపు రామగిరిరావు, మెదరమెట్ల సురేంద్ర, పులిబళ్ల సత్యనారాయణ, మల్లి బాబు పాల్గొన్నారు.



నిండిన చెరువులను పరిశీలిస్తున్న మంత్రి పార్థసారధి

భారీ వర్షం.. రోడ్లు జలమయం

ప్రజాశక్తి - ముదినేపల్లి

మండల కేంద్రమైన ముదినేపల్లిలో శనవారం భారీ వర్షం కురిసింది. తెల్లవారుజామున మొదలైన వర్షం ఉదయం ఏడు గంటల వరకు పడుతూనే ఉంది. ఈ భారీ వర్షంతో అంతర్గత రోడ్లన్నీ జలమయమయ్యాయి. సుమారు రెండు గంటలకు పైగా కురిసిన భారీ వర్షంతో గ్రామాల్లోని అంతర్గత రోడ్లు, ఆర్‌అండ్‌బి రోడ్లపైకి భారీగా వర్షపు నీరు చేరింది. లోతట్టు, పల్లపు ప్రాంతాల్లో వర్షపు నీరు చేరి ప్రజల అవస్థలు పడ్డారు. అన్నవరం జగనన్న కాలనీలో నివాసం చుట్టూ నీరు చేరడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడ్డారు. అంబేద్కర్ న్యూ కాలనీలో వర్షపు నీరు నిలిచింది. గ్రామంలోని రోడ్లు జలమయం కావడంతో రాకపోకలు సాగించేందుకు పాదచారులు, ద్విచక్ర వాహనదారులు ఇబ్బంది పడ్డారు. వర్షంతో పలు కాలనీల్లో నీరు రోడ్లపై చేరడంతో నివాసితులు తీవ్ర అసౌకర్యానికి లోనయ్యారు. ముదినేపల్లితో పాటు మండలంలోని పలు గ్రామాల్లో కురిసిన వర్షానికి అంతర్గత రోడ్లు జలమయమయ్యాయి. ముదినేపల్లిలోని మూడో బజార్ జలమయమైంది. దీంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, నివాసితులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు. ఈ వర్షానికి తోడు ఉరుముల శబ్దాలు, మెరుపులతో ప్రజలు భయాందోళన చెందారు.



ముదినేపల్లిలో..



కలిదిండిలో...

రహదారులు జలమయం

కలిదిండి : ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో కూడిన వర్షం వల్ల బస్టాండ్ సమీపంలోని రాష్ట్రీయ రహదారి, కోట కలిదిండికి వెళ్లే దారిలో డ్రెయినేజీ నీటితో కలిసి నిలిచిపోవడంతో పాదచారులు, ద్విచక్ర వాహనదారులు పలు ఇక్కట్లకు గురయ్యారు. కలిదిండి నుంచి ఉప్పుటేరు వంతెన వరకు రాష్ట్రీయ రహదారిపై నీరు వెళ్లే మార్గం లేక పలు చోట్ల వర్షపు నీరు నిలిచిపోయింది. లోడిదలంక వెళ్లే రోడ్డుపై నీరు నిలిచిపోవడంతో పాటు, రోడ్డు గోతులమయంగా అధ్వానంగా మారిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు.

సెలవుల్లో తరగతులు నిర్వహించొద్దు

నారాయణ జూనియర్ కాలేజీ,, శ్రీచైతన్య స్కూల్‌ను అడ్డుకున్న ఎస్ఎఫ్ఐ

విద్యాశాఖాధికారులు స్పందించాలని డిమాండ్

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

రెండో శనివారం ప్రభుత్వ సెలవు అయినప్పటికీ తరగతులు నిర్వహిస్తున్న నారాయణ జూనియర్ కాలేజీ, శ్రీ చైతన్య పాఠశాలలను ఎస్ఎఫ్ఐ నాయకులు అడ్డుకుని తరగతులు జరగకుండా మూసివేయించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.లెనిన్ మాట్లాడుతూ నారాయణ, చైతన్య విద్యాసంస్థలు ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు దినాల్లో కూడా విద్యార్థులను తరగతిలో బంధిస్తున్నారన్నారు. కార్పొరేట్ విద్యాసంస్థల్లో రోజులో ఒక గంట కూడా వ్యాయామ విద్యకు కేటాయించడంలేదని, అలాంటిది శనివారం, ఆదివారం కూడా విద్యార్థులకు స్వేచ్ఛ లేకుండా తరగతులు నిర్వహించి విద్యార్థులను మానసిక ఒత్తిడికి గురి చేస్తున్నారని చెప్పారు. తల్లిదండ్రులు కూడా ర్యాంకుల ప్రపంచంలో మునిగిపోయారని, విద్యార్థుల మానసిక పరిస్థితి ఏ విధంగా ఉందో తెలుసుకోలేకపోతున్నారని, దీనివల్ల విద్యార్థుల్లో మానసిక, శారీరక ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయని చెప్పారు. కార్పొరేట్ విద్యావ్యవస్థపై విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ ఉండాలని, అధికారుల పర్యవేక్షణ లేకపోవడం వల్లే చైతన్య, నారాయణ విద్యాసంస్థల్లో ఆగడాలు పెరిగిపోయాయన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు నిత్యం పర్యవేక్షించాలని, సెలవు దినాల్లో తరగతులు నిర్వహించకుండా చూడాలని డిమాండ్ చేశారు. అలాగే ఎన్ సాట్ స్కాలర్‌షిప్ పేరుతో ఆదివారం నారాయణ విద్యాసంస్థల్లో పరీక్ష నిర్వహిస్తున్నారని, దీనికి ప్రభుత్వం ఎలాంటి అనుమతి ఇవ్వలేదని తెలిపారు. ఈ పరీక్ష ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులను టార్గెట్ చేసుకుని నిర్వహిస్తున్నారని, ముఖ్యంగా ప్రభుత్వ రంగ విద్యాసంస్థల్లో చదివే విద్యార్థులను తమ స్కూలు వైపు లాక్కునేందుకే ఈ పరీక్ష నిర్వహిస్తున్నారని తెలిపారు. పరీక్ష ఫీజు వంద రూపాయలు అని, ఈ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా రూ.కోట్లు నారాయణ విద్యాసంస్థలు సంపాదిస్తున్నాయని తెలిపారు. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు నారాయణ విద్యాసంస్థపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏలూరు పట్టణ నాయకులు వై.అభి, టి.వంశీ, ఎస్.రాజా తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బయటకు పంపిస్తున్న ఎస్ఎఫ్ఐ నేతలు

వెన్నెముక లేని మోడీ సర్కార్‌ను నిలదీయాలి

ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా పోరాడాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

వెన్నెముక లేని మోడీ సర్కార్‌ను నిలదీయాలని, అమెరికా ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బి.బలరాం దేశ యువతకు పిలుపునిచ్చారు. స్థానిక పవర్‌పేటలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన ట్రంప్ సుంకాలు - దేశంలో ప్రభావం అంశంపై జరిగిన స్టడీ సర్కిల్‌కు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డిఎన్‌విడి.ప్రసాద్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బలరాం, సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి మాట్లాడుతూ పెట్టుబడిదారి వ్యవస్థ, సామ్రాజ్యవాదం సంక్షోభంలో చిక్కుకున్నప్పుడు వాటి నుంచి బయట పడేందుకు చేసే ప్రయత్నాల్లో భాగంగా అమెరికా ట్రంప్ సుంకాలను విధించడం, యుద్ధాలను ప్రోత్సహించి తమ ఆయుధాలను అమ్ముకునే పని చేస్తున్నారని తెలిపారు. ట్రంప్ సుంకాలు భారతదేశ ఆర్థిక వ్యవస్థను, వ్యవసాయ రంగాన్ని తీవ్రంగా దెబ్బతీస్తున్నాయన్నారు. అంతర్జాతీయ నిబంధనలకు విరుద్ధంగా సుంకాలు విధిస్తున్నా, అమెరికా నుంచి భారత్‌లోకి దిగుమతి అవుతున్న వస్తువులపై సుంకాలను పూర్తిగా ఎత్తివేయాలని, భారత్ నుంచి ఎగుమతి అయ్యే వాటిపై భారీగా సుంకాలు వేస్తామని ట్రంప్ ప్రకటిస్తున్నా వెన్నెముకలేని మోడీ సర్కార్ గట్టిగా వ్యతిరేకించడం లేదని, అమెరికా సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీ వ్యవస్థకు లోబడి పోయిందని వారు తీవ్రంగా విమర్శించారు. ప్రతీకార సుంకాల ప్రభావంతో భారత్‌లోని వ్యవసాయ రంగం పూర్తిగా దెబ్బ తినడమే కాకుండా, ఉపాధి అవకాశాలు కోల్పోతారని, దేశ ఆర్థిక వ్యవస్థ కుదేలవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మోడీ మెతక వైఖరికి, ట్రంప్ సుంకాలకు వ్యతిరేకంగా దేశంలో యువత ముందుకు వచ్చి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె.శ్రీనివాస్, పి.రామకృష్ణ, జిల్లా నాయకులు పి.రవికుమార్, కె.లెనిన్, ఆదిశేషు, ఎం.ఇస్సాక్, జె.గోపి, ఎస్.సత్యనారాయణ పాల్గొని మాట్లాడారు.



స్టడీ సర్కిల్‌లో మాట్లాడుతున్న బి.బలరాం



జెండా ఆవిష్కరిస్తున్న నేతలు

ఐద్వా రాష్ట్ర మహాసభ జయప్రదానికి పిలుపు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరిగే 16వ ఐద్వా రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా అధ్యక్షురాలు పి.హైమావతి, జిల్లా కార్యదర్శి ఎ.శ్యామలరాణి కోరారు. ఈ మేరకు శనివారం స్థానిక పవర్‌పేటలోని ఐద్వా జిల్లా సంఘ కార్యాలయం వద్ద, గన్ బజార్ సెంటర్ గంగానమ్మ గుడిసెంటర్ వద్ద ఐద్వా పతాక ఆవిష్కరణ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ సంఘం 16వ రాష్ట్ర మహాసభ ఈ నెల 13, 14, 15 తేదీల్లో అనంతపురంలో జరుగుతున్నాయని, సభలకు జాతీయ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. మహాసభకు రాష్ట్రం నలుమూలల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరవుతున్నారని, 13వ తేదీన భారీ బహిరంగ సభ జరుగుతుందని, ఈ సభలో మూడేళ్ల కాలంలో ఉద్యమ అనుభవాలను చర్చించి, భవిష్యత్ కార్యాచరణకు ప్రణాళికలు సిద్ధం చేస్తారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ పథకాల్లో ఆడబిడ్డ నిధి వెంటనే అమలు చేయాలని, మద్యం, డ్వాక్రా సమస్యలు, మైక్రో ఫైనాన్స్ సమస్యలపై చర్చించి కర్తవ్యాలను రూపొందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎం.అరుణకుమారి, బి.రాజేశ్వరి, లలిత, లక్ష్మి, జనని, పూర్ణ, మమత, సుజాత, వెంకటలక్ష్మి, సింహాచలం, తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : ఐద్వా రాష్ట్ర మహాసభ జయప్రదం చేయాలని కోరుతూ చింతలపూడి ప్రజా సంఘాల కార్యాలయం వద్ద జెండా ఆవిష్కరించారు. అక్టోబర్ 13వ తేదీ నుంచి మూడు రోజుల పాటు అనంతపురంలో జరుగుతున్న ఐద్వా 13వ మహాసభ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సభ జయప్రదానికి చిహ్నంగా ముగ్గు వేశారు. ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.శ్యామలరాణి జెండా ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకురాలు ఎం.వరలక్ష్మీదేవి, పట్టణ నాయకురాలు కురిసెట్టి అనురాధ, పి.గోపీలక్ష్మి, ఆర్.సుజాత, లక్ష్మి, విజయ, ప్రియ పాల్గొన్నారు.



అవగాహనా ర్యాలీ

అంగన్‌వాడీలో బాలికా దినోత్సవం

ప్రజాశక్తి - ముసునూరు

మండలంలోని కాట్రేనిపాడు గ్రామంలో అంగన్వాడీ కేంద్రం వద్ద అంతర్జాతీయ బాలిక దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి గద్దల సుహాసిని మోహనరావు, ఎంపిటిసి సభ్యులు సూర్యదేవర నాగ మంజుల శ్రీనివాసరావు, రాపర్ల బాలకృష్ణ, రాపర్ల ప్రతాప్, బొమ్మకంటి శ్యామలరావు, పలువురు టిడిపి నాయకులు, అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

శ్మశానవాటిక ఆక్రమణపై ఎంఎల్‌ఎకు వినతి

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలోని వెంకటాపురం పంచాయతీలో ఒసి, ఎస్‌సి, బిసిలకు సంబంధించిన శ్మశానవాటిక ఆక్రమణకు గురవుతుందని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్‌కు గ్రామస్తులు వినతిపత్రం అందించారు. శ్మశానవాటిక విషయంలో న్యాయం చేయాలని, సుబ్బారాయుడుగూడెంలో శ్మశాన వాటిక లేదని, ఏర్పాటు చేయాలని కోరుతూ వెంకటాపురం పంచాయతీ ప్రజలు, నాయకులు వినతిపత్రం అందించారు.

శక్తి యాప్‌పై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

అమీనాపేటలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహంలో బాలికలకు శక్తి యాప్‌పై అవగాహన కల్పించినట్లు అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. బాలికలకు అదనకు ఎస్‌పి ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్‌పి సూర్యచంద్రరావు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ శక్తి యాప్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఆండ్రాయిడ్ ఫోన్లలో శక్తి యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని అవసరమైన సమయాల్లో పోలీసుల సహాయాన్ని పొందవచ్చని తెలిపారు. ఆపదలో ఉన్నప్పుడు 112 నెంబర్‌కు సమాచారం ఇస్తే వెంటనే పోలీసులు అక్కడకు చేరుకుని సహాయం అందిస్తారని చెప్పారు. యాప్ నెంబర్ 7993485111కు గాని మహిళా హెల్ప్‌లైన్ 181 గాని ఫోన్ చేయవచ్చని సూచించారు. ప్రభుత్వం మహిళల రక్షణ కోసం యాప్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిందని, దానికి అనుగుణంగా పోలీసు శాఖ పనిచేస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ వార్డెన్ వెంకటేశ్వర్లు, ఇందిరాదేవి, పుష్పలత, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్‌ఐ నాగమణి, శక్తి టీమ్ సభ్యులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

గోడను బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బైక్ అదుపుతప్పి గోడను ఢీకొనడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మీర్జాపురం గ్రామ శివారు కంద్రికగొల్లగూడెం వద్ద చోటు చేసుకుంది. మండల పరిధిలోని తుక్కులూరు గ్రామానికి చెందిన బత్తుల రామ్మోహన్‌రావు (50) శుక్రవారం తుక్కులూరు నుంచి హనుమాన్ జంక్షన్ వైపు ద్విచక్ర వాహనంపై వెళు న్నాడు. ఈ క్రమంలో మీర్జాపురం గ్రామ శివారు కంద్రిక గొల్లగూడెం వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి సమీపంలోని గోడను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామ్మోహన్‌రావు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108కు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న 108 సిబ్బంది పరీక్షించి రామ్మోహన్‌రావు మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నూజివీడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రామ్మోహన్‌రావు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోజువారీ కూలి పనులు చేసుకునే రామ్మోహన్‌రావుకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్ మార్జిన్‌లో ఒరిగిన లోడ్ లారీ

ప్రజాశక్తి - ముదినేపల్లి

చేపల మేత లోడుతో వెళ్తున్న లారీ రోడ్డు మలుపులో అదుపుతప్పి ఒరిగింది. ఈ సంఘటన శనివారం ముదినేపల్లి శివారు అన్నవరం కాలువ గట్టు మలుపు వద్ద చోటు చేసుకుంది. మండలంలోని కాకరవాడ శివారు దేవరం గ్రామంలోని ఆక్వా చెరువులకు చేపల మేత లోడుతో వెళ్తున్న లారీ ముదినేపల్లి పంచాయతీ శివారు అన్నవరం కాలువ గట్టు మలుపు వద్దకు రాగానే అదుపుతప్పి రోడ్డు మార్జిన్‌లో ఒరిగింది. దీంతో ఈ రూటులో ప్రయాణించే వాహనదారులు ఇబ్బంది పడ్డారు. ఈ రహదారి ఇరుకు కావడంతో రెండు వాహనాలు తప్పుకునే అవకాశం లేదు. లారీ మలుపు వద్ద ఒరిగిపోవడంతో ఈ రోడ్డులో ప్రయాణించే స్కూలు బస్సులు, ట్రాక్టర్లు, ఆటోలు, ఇతర వాహనాలు వడాలి మీదుగా ముదినేపల్లి రాకపోకలు సాగించాయి.



ఒరిగిన లారీ

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

గ్రామాలాభివృద్ధిపై దృష్టి సారించాలి

అంతర్గత రహదారులు, డ్రెయినేజీలు లేక ఇబ్బందులు

తీరని దోమలు, తాగునీటి సమస్యలు

సిపిఎం బృందం పర్యటనలో వెలుగులోకి



మీర్జాపురంలో పర్యటిస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పల్లెటూర్లు కన్నీరు పెడుతూ కనీస సౌకర్యాలకు ఆమడ దూరంగా కునారిల్లుతున్నాయని అనడానికి చక్కని ఉదాహరణగా నూజివీడు మండలం మీర్జాపురం గ్రామం కనిపిస్తుంది. సిపిఎం బృందం మీర్జాపురం గ్రామంలో శనివారం పర్యటించింది. ఈ సందర్భంగా అక్కడ గ్రామీణ ప్రాంత ప్రజానీకం రోడ్లు సక్రమంగా లేకపోవడం, డ్రెయినేజీల వ్యవస్థ దారుణంగా ఉండడం, అస్తవ్యస్తమైన తాగునీటి సరఫరా, వెలిగి వెలగని వీధి దీపాలు వంటి సమస్యలను సిపిఎం బృందం దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం బృంద నాయకులు, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు మాట్లాడుతూ స్వాతంత్రం వచ్చి 80 ఏళ్లు గడుస్తున్నప్పటికీ నేటికీ పల్లెలు కనీస సౌకర్యాలు లేక కన్నీరు పెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పల్లెల అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామని 2024 సాధారణ ఎన్నికల్లో హామీ ఇచ్చిన కూటమి ఏమాత్రం నెరవేర్చడంలేదన్నారు. ఏ ఒక్క పల్లెటూరులోనూ రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సక్రమంగా లేదన్నారు. దోమలు విపరీతంగా పెరిగిపోవడంతో విష జ్వరాలు, డెంగీ, ఏరియా, ఫ్లూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు వ్యాప్తి చెంది ప్రజలు అనారోగ్యాల పాలవుతున్నారని వాపోయారు. పాలకులు గ్రామాలాభివృద్ధి పట్ల దృష్టి సారించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పల్లె ప్రాంతాల్లో కనీస సౌకర్యాల కల్పన కోసం నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఉన్న అన్ని గ్రామాల్లో సిపిఎం బృందం పాదయాత్ర చేసి ఆందోళన ప్రణాళికాబద్ధంగా కొనసాగిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బోసు, సిపిఎం నాయకులు ప్రసాద్, మీర్జావలి, ఏసుబాబు, సుధాకర్, జక్కుల శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు భూములు పంపిణీ చేయాలి

వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభలో తీర్మానం

సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులుగా సీత, ప్రభాకరరావు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని ల్యాండ్ సీలింగ్ భూములు, ఎర్రకాలువ ప్రాజెక్టు ముంపు లేని మిగులు, ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం నేతలు డిమాండ్ చేశారు. మండలంలోని పట్టెన్నపాలెంలో శుక్రవారం, శనివారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం మండల మహాసభ నిర్వహించారు. ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం పాల్గొని వ్యవసాయ కార్మికుల సమస్యలపై చర్చించారు. అనంతరం పలు తీర్మానాలు ఆమోదించి రానున్న మూడేళ్ల కాలంలో ఈ సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని ఆమోదించారు. అనంతరం నూతన కమిటీ 17 మందితో ఏర్పాటు చేయగా అధ్యక్షురాలిగా యాగంటి సీత, కార్యదర్శిగా అందుగుల ప్రభాకరరావు ఎన్నికయ్యారు. అనంతరం సీత, ప్రభాకరరావు మాట్లాడుతూ మూడేళ్ల కాలంలో భూ పోరాటాలు, కూలి పోరాటాలు, ఇళ్ల స్థలాలు, స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించామని, వీటితో పాటు ఉపాధి హామీ చట్టం అమలు కోసం పోరాటాలు నిర్వహించామని తెలిపారు. ఈ రెండు రోజుల్లో వ్యవసాయ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలు చర్చించామని, ప్రధానంగా మండలంలోని ల్యాండ్ సీలింగ్ భూములు ఎర్రకాలువ ప్రాజెక్టు ముంపు లేని మిగులు, ప్రభుత్వ భూములు పేదలకు పంపిణీ చేయాలని తీర్మానించారు. వ్యవసాయ కార్మికులకు సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం కూలీలకు ఆడ, మగ తేడా లేకుండా రూ.800 కూలి ఇవ్వాలని, అధికారులు గ్రామాల్లో సభలు నిర్వహించి అవగాహన కల్పించి చట్టాన్ని అమలు చేయాలని కోరారు. ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేసి 200 రోజులు పనులు కల్పించి రూ.600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కూలి రేటులో రోడ్లు, డ్రెయినేజీ, వీధిలైట్లు, తాగునీరు, శ్మశాన భూ సమస్యలు పరిష్కరించాలని తీర్మానించారు. వ్యవసాయ కార్మికులకు ఇళ్ల స్థలాలు లేనివారికి మూడు సెంట్ల ఇళ్ల స్థలం, పక్కా మంజూరు చేసి రూ.పది లక్షలతో ప్రభుత్వం ఇళ్ల నిర్మాణం చేపట్టాలని, విద్య, వైద్యం పేదలకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, తీర్మానాలన్నీ అమలు చేయాలని, లేకపోతే వ్యవసాయ కార్మికులందరినీ సంఘటితం చేసి పోరాటాలు నిర్వహిస్తామని ప్రభుత్వాన్ని, అధికారులను హెచ్చరించారు. ఈ మహాసభలో మండల కమిటీ సభ్యులు జోడే సూర్యచంద్రరావు, ఎం.బాలరాజు, జి.మరియమ్మ, నాగరాజు, ఎం.కుమారి, పిల్లి పోతురాజు, సిహెచ్.లక్ష్మీనారాయణ, ఎ.విశ్వేశ్వరరావు, ఎర్రమల కృష్ణ, కె.మంగయ్య, ఎస్.వెంకటేశ్వరరావు, వి.నరసరావు, మడవి వరలక్ష్మి, కలపాల వెంకయ్య, పి.చంద్రరావు, టి.వసుంధర పాల్గొన్నారు.




సీత



ప్రభాకరరావు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలకు అభినందన



అవార్డు అందుకున్న ప్రతాప్

ప్రజాశక్తి - ముసునూరు

జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. మండలంలోని లోపూడి గ్రామానికి చెందిన వరికూటి ప్రతాప్ సుమారు 20 ఏళ్ల నుంచి ఉపాధ్యాయ వృత్తిలో ఉంటూ ప్రయివేట్ విద్యాసంస్థలు నిర్వహిస్తున్నారు. శాసనమండలి మాజీ సభ్యులు కెఎస్.రామకృష్ణ, అప్సర డెమోక్రటిక్ స్టేట్ ప్రెసిడెంట్ గొల్లపూడి మోహన్‌రావు, సెక్రటరీ సురేందర్ రెడ్డి, గుంటూరు మిర్చి యార్డ్ ఛైర్మన్ చేతులమీదగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు స్వీకరించారు. దీంతో మండలంలోని ప్రయివేట్ విద్యాసంస్థల అధినేతలు, అధికారులు, వైసిపి నాయకులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న వరికూటి ప్రతాప్‌నకు శుభ అభినందనలు తెలిపారు.

ఆనందంగా ఉంది

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు లభించడం ఆనందంగా ఉందని ముసునూరు జెడ్‌పిటిసి సభ్యులు వరికూటి ప్రతాప్ అన్నారు. అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా గుంటూరులో అప్సా డెమోక్రటిక్ స్టేట్ అధ్యక్ష, కార్యదర్శులు గొల్లపూడి మోహనరావు, సురేంద్రరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును మాజీ ఎంఎల్‌సి కెఎస్.రామకృష్ణ చేతుల మీదుగా స్వీకరించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పొగాకు యార్డు ఛైర్మన్ మన్నవ సుబ్బారావు, ఎన్‌ఆర్‌ఐ విద్యా సంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తిలక్, తదితరులు పాల్గొన్నారు.

తేరా ప్రసాద్‌కు సన్మానం

ఉంగుటూరు : రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత తేరా ప్రసాద్‌ను ఉంగుటూరు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. తేరా ప్రసాద్ ఉంగుటూరు మండలంలో పందిరెడ్డిగూడెంలో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పనిచేసి జూన్‌లో బదిలీపై ఏలూరు దగ్గరలో మానూరుకు వెళ్లారు. 32 ఏళ్ల విద్యార్థుల విద్యాభివృద్ధికి కృషి చేసినందుకు సెప్టెంబర్ ఐదో తేదీన సిఎం చంద్రబాబు, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతులమీదుగా స్టేట్ బెస్ట్ టీచర్ అవార్డు అందుకున్నందుకు ఉంగుటూరు ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ గౌరవ అధ్యక్షులు శీతాల సత్యనారాయణ, అధ్యక్షులు వునుముల రాంబాబు, ప్రధాన కార్యదర్శి డాకి జోగినాయుడు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి సిహెచ్.శ్రీధర్, యుటిఎఫ్ సీనియర్ నాయకులు అల్లు శ్రీను, జి.రామారావు, హరికృష్ణ, ప్రేమ్‌కుమార్, లక్ష్మీనారాయణ, కొఠారి సాంబశివరావు, సోమరాజు, వెంకటేష్, డి.శ్రీనివాస్, కె.శ్రీనివాసరావు, రమణ పాల్గొన్నారు.




ప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రముఖులు

నూతన ఉపాధ్యాయులకు ఎంఎల్‌ఎ సత్కారం

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

డిఎస్‌సి-2025 పరీక్షలో విజయం సాధించిన ఉపాధ్యాయులను ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ ఘనంగా సన్మానించారు. పట్టణంలోని ఆలపాటి గంగాభవాని ఫంక్షన్ హాలులో టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సొంగా రోషన్‌కుమార్ మాట్లాడుతూ గురువులు సమాజానికి ఆదర్శమన్నారు. నాటి వైసిపి ప్రభుత్వంలో గురువులపై కక్ష సాధింపులకు పాల్పడితే కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన తర్వాత సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ మెగా డిఎస్‌సి నిర్వహించి రాష్ట్రంలో నూతన ఉపాధ్యాయులను నియమించారన్నారు. చింతలపూడి నియోజకవర్గంలో డిఎస్‌సిలో విజయం సాధించి ఉపాధ్యాయులుగా నియమితులైన వారిని ఎంఎల్‌ఎ జ్ఞాపికలుతో పాటు శాలువలతో సత్కరించారు. నియోజకవర్గంలో మొత్తం 150 మంది కొత్త ఉపాధ్యాయులు ఎంపికయ్యారని, అందరూ ఉత్తమ ఉపాధ్యాయులుగా నిలిచి విద్యార్థులకు వెలుగులు నిచ్చే మార్గదర్శకులుగా నిలవాలన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి దాసరి శ్యాంసుందర్ శేషు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒలతోపాటు ఉపాధ్యాయులు, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, జనసేన కన్వీనర్ మేకా ఈశ్వరయ్య, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, పల్లి శ్రీను, కౌన్సిలర్ వలవల తాతాజీ, పరిమి సత్యనారాయణ, పెనుమర్తి రాంకుమార్, సొసైటీ ఛైర్మన్ మానికల నాగేశ్వరరావు, రావూరి కృష్ణ, పగడం సౌభాగ్యవతి, బురుజు ఉమామహేశ్వరి, తదితరులు నాయకులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

అవగాహనతోనే కీటక జనిత వ్యాధుల నివారణ

ప్రజాశక్తి - టి.నరసాపురం

కీటక జనిత వ్యాధులపై అవగాహనతోనే నివారణ సాధ్యం అవుతుందని చింతలపూడి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎన్ఎ.ప్రసాద్ తెలిపారు. మండలంలోని తిరుమలదేవిపేట గ్రామంలో డెంగీ, మలేరియా నివారణపై శనివారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఆయన తెలిపారు. నివాసిత ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. జ్వరం వస్తే వెంటనే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్త పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. సూపర్ జిఎస్‌టి-సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా సాధారణ మందులపై పూర్తిగా, దీర్ఘకాలిక వ్యాధులపై 12 శాతం నుంచి ఐదు శాతం తగ్గించినట్లు ఆయన తెలిపారు. మందులపై జిఎస్‌టి తగ్గించడంతో ప్రజలకు మందులు చౌక ధరలకు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌ఎన్ కోవడమ్మ, సబ్ యూనిట్ హెల్త్ అసిస్టెంట్ కె.శ్రీనివాసరావు, ఎంఎల్‌హెచ్‌పి ఎన్.ప్రియాంక, విహెచ్ ఎస్.భవాని, ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.



అవగాహన కార్యక్రమం


మందుబాబులకు అడ్డాగా రక్షిత మంచినీటి పథకం

వారి చేష్టలతో నివాసితుల ఇబ్బందులు

పట్టించుకోని గ్రామపంచాయతీ సిబ్బంది

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లిలోని గుడ్లవల్లేరు రోడ్డులో ఉన్న గ్రామపంచాయతీ రక్షిత మంచినీటి పథకం మందు బాబులకు అడ్డాగా మారింది. రక్షిత మంచినీటి పథకం చెరువు చుట్టూ పచ్చని చెట్లు, మదుగు ఉండడంతో మందుబాబులకు ఆవాసంగా మారింది. దీంతో నిత్యం ఇక్కడ పగలు, రాత్రి అనే తేడా లేకుండా నిరంతరం మద్యం తాగుతూ యువకులు హల్‌చల్ చేస్తున్నారు. మందుబాబుల చేష్టలతో స్థానికులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మద్యం మత్తులో యువకులు చేసే వికృతి చేష్టలు, కేరింతలతో స్థానిక మహిళలు భయపడుతున్నారు. రక్షిత మంచినీటి పథకం ప్రధాన రహదారిలో ఉండడంతో పాటు సమీపంలోనే మద్యం షాపు ఉంది. దీంతో మందు బాబులు మద్యం కొనుగోలు చేసి బైకులపై చెరువుగట్టుకు చేరుకుని ఫిల్టర్ బెడ్స్ వద్ద తిష్టవేసి మద్యం సేవిస్తూ గంటల తరబడి కాలయాపన చేస్తున్నారు. స్థానికులే కాకుండా ఇతర ప్రాంతాల నుంచి మందుబాబులు ఇక్కడకు వచ్చి మద్యం తాగుతూ మద్యం ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ గ్లాసులు, బిరియాని ప్యాకెట్లు, క్యారీ బ్యాగులు వదిలి వెళ్తున్నారు. దీంతో ఆ ప్రాంతమంతా మద్యం ఖాళీ సీసాలు, ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండిపోయింది. మందుబాబుల వికృతి చేష్టలతో స్థానికులు పడరాని పాట్లు పడుతున్నారు. మద్యం మత్తులో మందుబాబులు వేసే కేకలు, చేసే అల్లర్లకు మహిళలు భయాందోళనలు చెందుతున్నారు. ఈ కేకలు భరించలేని స్థానికులు మందుబాబులను ప్రశ్నిస్తే ఎదురుతిరిగి దాడి చేస్తున్నట్లు నివాసితులు చెబుతున్నారు. మా ఇష్టం మేము ఇక్కడే తాగుతాం మీ చేతనైంది చేసుకోండి, మాకు ఎదురేలేదంటూ మందుబాబులు స్థానిక నివాసితులతో గొడవ పడుతున్నట్లు చెబుతున్నారు. దీంతో స్థానికులు ఏమి చేయాలో తెలీక రక్షిత మంచినీటి పథకం ట్యాంకు ఆపరేటర్లకు, పంచాయతీ సిబ్బందికి తెలియజేసినా పట్టించుకోవటం లేదంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మందుబాబులు పలుసార్లు బైకులపై మహిళలను సైతం ఇక్కడికి తీసుకొచ్చి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఇదేమని ప్రశ్నించిన స్థానికులపై ఎదురు తిరుగుతున్నట్లు చెబుతున్నారు. ఇప్పటికైనా గ్రామపంచాయతీ స్పందించి రక్షిత మంచినీటి పథకం చెరువు వద్ద జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు చెక్ పెట్టాలని స్థానిక నివాసితులు కోరుతున్నారు. అదేవిధంగా పోలీసులు కూడా జోక్యం చేసుకుని చెరువు గట్టున జరుగుతున్న అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.



మందుబాబులు మద్యం సేవించే ప్రాంతం ఇదే



మంచినీటి చెరువు గట్టున మద్యం సీసాలు

వైసిపి ఆధ్వర్యాన సంతకాల సేకరణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మెడికల్ కాలేజీల ప్రయివేటీకరణ నిర్ణయాన్ని కూటమి ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని వైసిపి నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలోని వైసిపి మచిలీపట్నం పార్లమెంట్ పరిశీలకులు జెట్టి గురునాధరావు కార్యాలయం వద్ద చింతలపూడి ఎఎంసి మాజీ ఛైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, బొడ్డు వెంకటేశ్వరరావు, ముసునూరి వెంకటేశ్వరరావు, జంగారెడ్డిగూడెం మున్సిపల్ చైర్ పర్సన్ బత్తిన నాగలక్ష్మి సారధ్యంలో కోటి సంతకాల పోస్టర్ శనివారం ఆవిష్కరించారు.

ఉంగుటూరు : ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ వైసిపి చేపట్టిన కోటి సంతకాల సేకరణ రచ్చబండ కార్యక్రమం ఉంగుటూరులో శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌ఎ, పిఎసి సభ్యులు పుప్పాల వాసుబాబు పాల్గొన్నారు. ఈ మేరకు కోటి సంతకాలు కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గం నుంచి మొదటి సంతకాన్ని వాసుబాబు చేసి ఉద్యమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ మరడ మంగారావు, ఎంపిపి గంటా శ్రీలక్ష్మి, జెడ్‌పిటిసి సభ్యురాలు జయలక్ష్మి, వివిధ అనుబంధ విభాగాల నాయకులు పెనుగొండ బాలకృష్ణ, మంద జయలక్ష్మి, పుప్పాల గోపీ, బాజీ, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

రైస్‌మిల్లు ప్రారంభం

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండలంలోని పొంగుటూరు గ్రామంలో కెఎస్‌ఆర్ రైస్‌మిల్లును పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పారిశ్రామిక అభివృద్ధికి ఇలాంటి యూనిట్లు ఎంతో దోహదపడతాయన్నారు. రైతులకు మద్దతు ధరలు లభించేలా పరిశ్రమలు ముందుకు రావాలన్నారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు సృష్టించడంలో ఈ మిల్లు కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, కొవ్వూరు ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు, గోపాలపురం ఎంఎల్‌ఎ మద్దిపాటి వెంకటరాజు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వాహన తనిఖీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

సరైన ధ్రువపత్రాలు లేకుండా వాహనాలు నడపొద్దని ఏలూరు ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీధర్ సూచించారు. నగరంలోని అశోక్ నగర్ వంతెన సమీపంలో శనివారం ట్రాఫిక్ పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్‌ఐ శ్రీధర్ మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో వాహనానికి సంబంధించిన అన్ని పత్రాలను కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్ పొల్యూషన్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు వాహనదారులు తమ వెంట తెచ్చుకోవాలని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదం జరిగినప్పుడు ప్రాణాపాయస్థితి నుంచి రక్షించుకునే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - భీమడోలు

ఉంగుటూరు నియోజకవర్గ పరిధిలోని పలువురికి వైద్య సహాయం నిమిత్తం మంజూరైన సిఎం సహాయ నిధి మొత్తాల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం భీమడోలులోని టిడిపి కార్యాలయంలో నిర్వహించినట్లు ఆప్కాబ్ ఛైర్మన్ గన్ని వీరాంజనేయులు తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు మండలానికి చెందిన ఇద్దరు, నిడమర్రు మండలానికి చెందిన ముగ్గురు, ఉంగుటూరు మండలానికి చెందిన తొమ్మిది మంది, గణపవరం మండలానికి చెందిన ఏడు మందికి మంజూరైన రూ.12.89 లక్షల విలువైన చెక్కులు, ఎల్‌ఒసిలను అందించారు. ఈ మొత్తాలు ఆప్కాబ్ ఛైర్మన్ సిఫార్సు మేరకు మంజూరయ్యాయని కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో భీమడోలు ఎఎంసి ఛైర్మన్ శేషగిరి, జెడ్‌పిటిసి మాజీ సభ్యులు కరణం పెద్దిరాజు, ఇతర కూటమి నాయకులు పాల్గొన్నారు.

పిఎం ధన్-ధాన్య కృషి యోజనపై అవగాహన

ప్రజాశక్తి - ఉంగుటూరు

ప్రధాన మంత్రి ధన్-ధాన్య కృషి యోజన వీడియో కాన్ఫరెన్స్ ది చేబ్రోలు విశాల సహకార సంఘం(నారాయణపురం సొసైటీ)లో శనివారం నిర్వహించారు. జిల్లా సహకార అధికారి ఆరమిల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో రైతులతో వీక్షించారు. సొసైటీ ఛైర్మన్ కడియాల రవిశంకర్, డైరెక్టర్లు గౌతు బాల భాస్కర్, బొట్ట దుర్గారావు, వివిధ గ్రామాల సర్పంచులు, సంఘ సభ్యులు, పలువురు రైతులు హాజరయ్యారు. సొసైటీ సిఇఒ రంగ నగేష్, టిడిపి మండలాధ్యక్షులు వేములపల్లి సుధీర్ పాల్గొన్నారు.

పాస్‌పోర్టు పోయినది

ఏలూరు జిల్లా, ఉంగుటూరు మండలం, నాచుగుంట గ్రామానికి చెందిన గుడ కిరణ్, తండ్రి: అంజయ్య, డోర్ నెంబర్: 13-146 నకు చెందిన విశాఖపట్నం వారు జారీ చేసిన **X0936339** నెంబర్ గల ఒరిజినల్ పాస్‌పోర్టు నాచుగుంట నుండి తాడేపల్లిగూడెం మోటర్ సైకిల్ పై వెళుతుండగా పాస్‌పోర్టు కలిగిన కవరు మార్గమధ్యలో పడిపోయింది. మార్గమధ్యలో ఎంత వెదకినా దొరకలేదు. ఎవరికైన దొరికినచో ఈ క్రింది అడ్రస్‌కు సంప్రదించగలరు.

గుడ కిరణ్
S/o. అంజయ్య
D.No: 13-146, YSR కాలనీ,
నాచుగుంట, ఉంగుటూరు మండలం,
ఏలూరు జిల్లా - 534411